మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ప్రారంభం

మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను పూర్తి చేస్తున్న సిబ్బంది

దోమ, నవంబర్ 11: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నెల రోజులుగా తాగు నీరు రాక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని 'పానీ..పరేషానీ' అనే కథనంతో శనివారం నమస్తే తెలంగాణ దిన పత్రిక ప్రచురించింది. దీంతో సోమవారం అధికారులు స్పందించి ఇందిరమ్మ కాలనీ వాసులకు తాగు నీరు అందించేందుకు జేసీబీ సహాయంతో మిషన్ భగీరథ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. తాగు నీరు అందించేందుకు పనులను ప్రారంభించడంతో ఇందిరమ్మ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సర్వే తీరును పరిశీలించిన ఎంపీడీవోలు



పరిగి: నస్కల్ గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో కరం

పరిగి, నవంబర్ 11: ఇంటింటి కుటుంబ సర్వేను సోమవారం పరిగి మండలం నస్కల్, సయ్యద్ మల్కాపూర్ గ్రామాల్లో మండల అభివృద్ధి అధికారి ఎం.ఎ.కరీం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి, సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి వివరాలు అందజేయాలని సూచించారు. ఎన్యూమరేటర్లు ప్రజల సందేహాలు తీరుస్తూ ప్రజల నుంచి పూర్తి వివరాలు, సమాచారాన్ని రాబట్టి సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమ: ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేయా లని ఎంపీడీవో మహేశ్‌బాబు సూచించారు. మండల పరిధిలోని పాలేపల్లి, దోమ, బొంపల్లి గ్రామాల్లో సాగుతున్న సర్వే తీరును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి యజమానుల నుంచి అవసరమైన పూర్తి సమాచారాన్ని పొందు పర్చి ఎక్కడ కూడా పొరపాట్లు జరుగకుండా చూడాలని ఎన్యూమరేటర్లకు ఆయన సూచిం చారు. కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమ: పాలేపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో హహేశ్‌బాబు

26న చలో హైదరాబాద్

ఆసరా పింఛన్‌ల పెంపు కోసం .. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి

సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

వికారాబాద్, నవంబర్ 11: ఆసరా పింఛన్ల పెంపు కోసం ఈ నెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య తెలిపారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో వికారాబాద్ జిల్లా సదస్సు జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి జంగయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.ఆరువేలు, వృద్ధులు, వితంతువులకు ఒంటరి మహిళలకు, చేనేత, గీత, బీడీ కార్మికులకు రూ. నాలుగువేలు పింఛన్ పెంచుతామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ఆసరా పింఛన్‌దారులను మర్చిపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పక్క రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధుల వితంతుల పింఛన్ పెంచితే తెలంగాణలో పెంచకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రదేశ్ లో ఆసరా పింఛన్ పెంచి ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటింటికీ వెళ్లి ఇస్తుంటే.. తెలంగాణలో మాత్రం నెలాఖరు దాటినా పింఛన్ రావడం లేదంటే ఆసరా పింఛన్ దారుల మీద కాంగ్రెస్ సర్కారుకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఆసరా పింఛన్ దారులకు అండగా ఉండి పోరాటాన్ని ముందుకు తీసుకెళుతున్న ఏకైక వ్యక్తి మందకృష్ణ మాదిగ అన్నారు. పింఛన్లు పెంచకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై తాడోపేడో తెలుసుకోవడం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించారని గుర్తు చేశారు. నవంబర్ ఒకటి నుంచి 16 వరకు అన్ని జిల్లాల సదస్సులు నిర్వహించి, 17 నుంచి 23 వరకు అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని సూచించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే లక్షలాది మందితో నవంబర్ 26న చలో హైదరాబాద్ చేపట్టి తీరుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు జర్నమ్మ, నాయకుడు రాజు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల విధుల బహిష్కరణ

- కలెక్టర్ పై దాడిని ఖండించిన ఉద్యోగులు
- విధులు బహిష్కరించి నిరసన
- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం ఉద్యోగులు

పరిగి, నవంబర్ 11: దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్‌పై దాడికి నిరసనగా పరిగి మండల తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ దాడికి నిరసనగా కార్యాలయ సేవలు నిలిపి వేస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌రావు, ఉద్యోగులు పేర్కొన్నారు.

వికారాబాద్: వికారాబాద్ రెవెన్యూ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. కార్యాలయానికి తాళం వేశారు. నిరంతరం ప్రజల కోసం పని చేసే ఐఏఎస్ అధికారిపై దాడి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేశ్, ఉద్యోగులు సరోజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మర్పల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట అధికారులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు అనేక రకాలుగా వారి డిమాండ్ లను నెరవేర్చుకునే హక్కు ఉంది కానీ విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపైన భౌతిక దాడులు అనేవి హేయమైన చర్య అని టీపీఎస్ఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ రవి శెట్టి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ మల్లయ్య, ఎంపీవో సుశీల్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ షఫీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు..

ధారూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షాజిదాబేగం మాట్లాడుతూ కలెక్టర్‌పై దాడి చేయడం తగదని, దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు నవీన, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

బంట్వారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే కోట్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దేముల్ : తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గదులకు తాళం వేసి, విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట కలెక్టర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ బి.వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ రిచర్డ్స్ సైమన్, బసంత్ రెడ్డి, అవినాశ్, మహేశ్, శ్రీనివాస్, హరీశ్, భాగ్యలక్ష్మి, లక్ష్మీ,వెంకటయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట, అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న కలెక్టర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఆర్ఐలు వాహీద్, రాజురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్లు హారిక, రాధిక, రికార్డు అసిస్టెంట్లు రమేశ్, శ్రీకాంత్, సిబ్బంది మహేశ్, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలి కాని దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని గ్రామ పంచాయతీ కార్యదర్శిల జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాణిక్యం పేర్కొన్నారు. కలెక్టర్, ఇతర అధికారులపై దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో విధులను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మండలలంలోని ఆయా గ్రామ పంచా యతీ కార్యదర్శులు మురళీ కృష్ణ, జహంగీర్, పరుశురాం, శ్రీకాంత్, మల్లేశం ఉన్నారు

ఘనంగా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి

తాండూరు రూరల్, నవంబర్ 11: తాండూరు మండలం, జినుగుర్తి గేట్ సమీపంలోని మైనార్టీ గురుకుల (బాలుర) పాఠశాలలో సోమవారం దివంగత కేంద్ర మాజీ మంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ 135 జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్, పార్టీ మండల అధ్యక్షుడు జె.నాగప్ప, ప్రిన్సిపాల్ వినోద్ కన్నా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్యం వచ్చిన తర్వాత మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ పని చేసి, విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన ఆడుగు జాడల్లో నడిచి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ నాయకులు అబ్దుల్ సలీం, అబ్దుల్ ఖయ్యూం, అబ్దుల్ మతీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్టెల జర్నప్ప, కె.గోపాల్, పురుషోత్తంరెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం..అస్తవ్యస్థంగా..

కులకచర్ల, నవంబర్ 11: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్థంగా తయారైందని బీఆర్ఎస్ నాయకులు సారా శ్రీనివాస్ పేర్కొన్నారు. పంచాయతీల్లో అధికారుల పాలనతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి రోజూ మురుగునీరు రోడ్డు పైనే పారుతుండడంతో అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. మురుగునీటి వలన దుర్వాసనతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో అస్తవ్యస్థంగా తయారైన పారిశుధ్యాని సక్రమంగా చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, నవంబర్ 11: చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాలుపంచుకోవాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ సూచించారు. సోమవారం పరిగిలోని మినీ స్టేడియంలో జూనియర్స్ అండర్ 17 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు చక్కటి వేదికలని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలలోను ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు

మధ్యాహ్న భోజనం పరిశీలన

పరిగి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ నెం.1లో సోమవారం మధ్యాహ్న భోజనం వంటకాలను మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందిం చాలన్నారు. మెనూను అమలు చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, కౌన్సిలర్ వెంకటేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మెథడిస్టు జాతర

ధారూరు, నవంబర్ 11: మెథడిస్టు క్రిస్టియన్ 102వ జాతర మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ప్రారంభమై ఆదివారం ముగుస్తుందన్నారు. జాతరకు వచ్చే యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. తాగునీరు, విద్యు త్, చెత్త కుండీలు, మరుగు దొడ్లు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దోమ, నవంబర్ 11: మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన డోకూరు హన్మంతు పది రోజులుగా మూత్రపిండాల సమస్యతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకుడు దాతన్‌గారి జగత్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామార్శించి రూ. ఐదు వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దాతన్‌గారి జగత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

పెద్దేముల్, నవంబర్ 11: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి మండల తహసీల్దార్‌కు అప్పగించినట్లు పెద్దేముల్ ఎస్ఐ కె.గిరెన్న తెలిపారు. మండల పరిధిలోని మన్‌సాన్ పల్లి వాగు నుంచి ఆదివారం రెండు ట్రాక్టర్లతో కొంతమంది వ్యక్తులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం అందిందన్నారు. అక్కడికి వెళ్లి గోపాల్ నాయక్, మెగావత్ రమేశ్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొడంగల్, నవంబర్ 11: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అదే విధంగా చదువుకున్న కళాశాలను అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబుతో పాటు డాక్టర్ శ్రీధర్‌కుమార్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన

టీచర్ సస్పెన్షన్

బండ్లగూడ, నవంబర్11: విద్యాబుద్ధులు చెప్పి.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తీర్చిదిద్దాల్సిన ఓ ఉపాధ్యాయుడు తమతోటి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ ఉపాధ్యాయుడిని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు సస్పెండ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. బుద్వేల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న వేణుగోపాల్‌రావు ఇటీవల ప్రధానోపాధ్యాయురాలు జాన్సీతో పాటు అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులతో అసభ్యంగా ప్రవరిస్తూ.. మానసికంగా వేధిస్తున్నాడు. అతడి తీరుపట్ల ఉపాధ్యాయులంతా సోమవారం పాఠశాలలో నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారితో పాటు కాంగ్రెస్ నాయకుడు బోర్ర జ్ఞానేశ్వర్‌రావు అక్కడికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకు వేణుగోపాల్‌రావుపై అనేక ఫిర్యాదులు రావడంతో జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు అతడిపై దర్యాప్తు చేయించారు. దర్యాప్తు నివేదికను రాజేంద్రనగర్ ఎంఈవో శంకర్‌రాథోడ్ 15 రోజుల కిందటే సుశింధర్‌రావుకు అందజేసినట్లు తెలిపారు. సోమవారం వేణుగోపాల్‌రావు చేష్టలతో విసిగిపోయిన ఉపాధ్యాయులు అందరూ కలిసి నిరసన తెలపడంతో జిల్లా విద్యాధికారి ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ ఎంఈవో ఆయనకు సస్పెషన్ పత్రాన్ని పాఠశాలలో అందజేసిన విషయం వేణుగోపాలరావుకు తెలిపారు.

సిటీలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): నగరంలో పనిచేస్తున్న ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అఫ్జల్‌గంజ్, లాలాగూడ, ఇన్‌స్పెక్టర్లు లింగేశ్వర్‌రావు, పైళ్ల కరుణాకర్‌రెడ్డిని సీసీఎస్‌కు బదిలీ చేయగా.. మల్టీజోన్ నుంచి వచ్చిన నునావత్ రవికి అఫ్జల్‌గంజ్, కలమాల రఘుబాబుకు లాలాగూడ ఎస్‌హెచ్ఓగా, కలమ సతీష్‌రెడ్డికి సైబర్‌క్రైమ్‌లో బాధ్యతలు అప్పగించారు. సీసీసీలో పనిచేస్తున్న పల్లె పద్మను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

రూ.72.84 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం

వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతా రెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 11: గంజాయి ముఠా గుట్ట రట్టు చేసినట్లు మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి తెలిపారు. సోమవారం పహాడీషరీఫ్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. బడంగ్‌పేట పరిధిలోని సుల్తాన్‌పూర్ వద్ద బాలాపూర్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలలో నిందితులు గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. నిందితులు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. బాలాపూర్ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి యూరఫ్‌కు చెందిన 170 గ్రాముల ఓషన్ గంజా (ఓజీ), తొమ్మిది కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.72.84 లక్షల విలువ జేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తున్న బండారి సునీల్, మహ్మద్ అస్లాం, మహ్మద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని విచారించడంతో మహ్మద్ ఇద్రిస్ కలీల్ అలియాస్ ఫర్హాన్, మహ్మద్ అబ్బాస్ కలిసి గంజాయిని రహస్యంగా సోషల్ మీడియా యాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. నిందితులు ఈ దందాను సోషల్ మీడియా ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రధాన నిందితుడు దుబాయ్ పారిపోయాడన్నారు. అబ్బాస్‌ను అరెస్టు చేయడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

దేవాలయాల్లో చోరీలు.. ముగ్గురి అరెస్ట్

రూ.40 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం

మన్సూరాబాద్, నవంబర్ 11: దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన ఉమేశ్ (23) క్యాటరింగ్ పనులు చేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన కార్తీక్ (20) సెంట్రింగ్ పనులు, నితిన్‌కుమార్ అలియాస్ మిట్టు (20) షాప్ కీపర్‌గా పనిచేస్తున్నాడు. ఉమేశ్, కార్తీక్, నితిన్‌కుమార్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడి తమ కోరికలను తీర్చుకునేందుకు దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ ముగ్గురు కలిసి దొంగతనాలు చేసేందుకు బైక్‌పై నగరానికి వచ్చి.. రెండు రోజుల పాటు లాడ్జీల్లో మకాం వేస్తారు. లాడ్జీకి సమీపంలో ఉండే దేవాలయాల వివరాలను గూగుల్‌లో సెర్చ్ చేసి రెక్కీ నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న దేవాలయం మూసిన అనంతరం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై ఆలయం వద్దకు వెళ్లి.. లోనికి చొరబడి హుండీలను పగులగొట్టి నగదును అపహరిస్తారు. ఈ క్రమంలో హయత్‌నగర్, తొర్రూర్ క్రాస్ రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలోకి 2024, సెప్టెంబర్ 12న చొరబడి హుండీలోని నగదును తస్కరించారు.

అదేవిధంగా.. మన్సూరాబాద్, సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని శ్రీ ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయంలో 2024, అక్టోబర్ 25న చొరబడి హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. సెంట్రల్ బ్యాంకు కాలనీలోని శ్రీ ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయం మేనేజర్ బొశెట్టి లింగయ్య ఆ మరుసటి రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. ఎల్బీనగర్ పోలీసులు సోమవారం ఉదయం సీరిస్ రోడ్డులోని డీవీఎం కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఉమేశ్, కార్తీక్, నితిన్‌కుమార్ బైకపై అటువైపు వచ్చారు. పోలీసులను చూసిన ముగ్గురు బైక్‌ను వదిలేసి పారి పోయేందుకు ప్రయత్నించారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన విషయం బయటపడింది. నిందితుల నుంచి రూ.40 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన ఉమేశ్, కార్తీక్, నితిన్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

కొత్త జీవితం ఇస్తానంటూ నమ్మించి..

బంజారాహిల్స్,నవంబర్ 11: 'నీ భర్త చనిపోయాడు కదా.. కొత్త జీవితం ఇచ్చి పెళ్లి చేసుకోవడంతో పాటు నీ పిల్లల్ని కూడా బాగా చూసుకుంటానని..' మాయమాటలు చెప్పాడు. రెండేండ్ల పాటు ఆమెను శారీరకంగా వాడుకున్న తర్వాత ముఖం చాటేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరి ప్రాంత నివాసి మహిళ(36) భర్త మూడేండ్ల కిందట చనిపోయాడు. ఆమె పెద్ద కుమారుడు తల్లిదండ్రుల వద్ద ఉండగా.. చిన్న కుమారుడు ఆమెతో పాటే ఉంటున్నాడు. కాగా, రెండేండ్ల కిందట అదే ప్రాంతంలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్న ఇమ్రాన్(28) తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెండ్లి చేసుకుని.. నీకు కొత్త జీవితం ఇస్తానంటూ నమ్మబలికాడు. నీ పిల్లలను బాగా చూసుకుంటానంటూ మాయమాటలు చెప్పడంతో ఆమె ఇమ్రాన్‌కు దగ్గరయ్యింది. మహిళను శారీరకంగా వాడుకున్న ఇమ్రాన్ ఇటీవల ముఖం చాటేయడం ప్రారంభించాడు. పెండ్లి ఎప్పుడు చేసుకుంటావంటూ ఆమె రెండ్రోజుల కిందట నిలదీయడంతో నిరాకరించడంతో పాటు ఆమెపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

PUBLIC NOTICE

It is hereby informed to all the General Public that my client's **BEGARI PARVATHAMMA, W/o. LATE B. PAPAIAH,** Aged about 75 yrs., Occ: Housewife, R/o. H.No. 2-4, Regadidoswada Village, Shabad Mandal, Ranga Reddy District-501 501 and others have filed the suit for Partition and Separate Possession against the family members for partition in Sy.No's. 174, admeasuring Ac. 4-30 gts., situated at Regadidoswada Village, Shabad Mandal, Ranga Reddy District before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District at Chevella vide **OS.No. 601/2023,** my client's objection for issuance of registration and alienation of the agriculture land bearing Sy.No's. 174, admeasuring Ac. 4-30 gts., situated at Regadidoswada Village, Shabad Mandal, Ranga Reddy District, in favour of any Third Parties till disposal of the case.

SUIT SCHEDULE PROPERTY

All that the agricultural land bearing Sy.No's. 174, admeasuring Ac. 4-30 gts., situated at Regadidoswada Village, Shabad Mandal, Ranga Reddy District and bounded by: East: Land of K.Sudarshan, West: Road, North: Land of Gopala Krishna Raju, South: Land of K.Sudarshan. Hence, this Public notice.

Sd/- G.CHANDRA SHEKAR, Advocate
#Beside Bank of India, Hyderabad Road, Chevella, District Ranga Reddy-501 503, T.S.
Cell: 9849751314, 9849689075.

బాలిక కిడ్నాప్, లైంగిక దాడి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 11(నమస్తే తెలంగాణ): ప్రేమ, పెండ్లి పేరుతో బాలికను కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు కనకాల రాజేశ్ (26)కు జీవితఖైదు, పది వేల జరిమానా విధిస్తూ, బాధిత బాలిక కుటుంబానికి రూ. పది లక్షల పరిహారం అందజేయాలని రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయమూర్